క్లుప్తంగా

ఎరుకుమాంబకు జలాభిషేకం



అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న ఆలయ ఈవో, భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో కొలువైన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం ఈవో జి.రామాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ ముందుగా గణపతి పూజ, అనంతరం అమ్మవారికి పూజలు చేశారు. ఎరుకుమాంబకు భక్తులు తమ స్వహస్తాలతో జలాభిషేకంతో జరిపారు. సాయంత్రం అమ్మవారిని నూతన చీరలు, పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

అలరించిన భజన



సంకీర్తనలు పాడుతున్న భజన బృందం

అల్లిపురం: బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా బుధవారం వీరబ్రహ్మేంద్ర స్వామి భజన బృందం, నల్ల దుర్గారావు ఆధ్వర్యంలో నిర్వహించిన భజన కార్యక్రమం అలరించింది. భజన బృందానికి ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు స్వామి తీర్థప్రసాదాలు అంజదేశారు. కార్యక్రమంలో అన్నమయ్య భక్తి మంజరి నిర్వాహకుడు శరగడ నూకరాజు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా పోలమాంబ ఆలయ వార్షికోత్సవం



విశేష అలంకరణలో అమ్మవారు

అల్లిపురం: అచ్చియ్యమ్మపేటలో వెలసిన పోలేరమ్మ హుండీ దరి పోలమ్మవారి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అచ్చియ్యమ్మపేట, జెండాచెట్టు వీధి ప్రాంతాల భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ఆలయం వద్ద నిర్వహించిన భజన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

వాజ్‌పేయికి సేవా నివాళి




పేద మహిళలకు చీరలు అందిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, బీజేపీ నాయకులు

మహారాణిపేట: దేశంలో సుపరిపాలన అందించిన ఘనత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయికి దక్కుతుందని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. భారతరత్న వాజ్‌పేయి శత జయంతి, క్రిస్మస్ సందర్భంగా బుధవారం మహారాణిపేట ఆఫీషియల్ కాలనీలోని బీజేపీ నాయకుడు ఒ.ఆల్బర్ట్ ఇంట్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ముందుగా వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కొండమ్మ, బీజేపీ రాష్ట్ర వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవి కుమార్, బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర సభ్యుడు ఒ.ఆల్బర్ట్, మహిళా నాయకురాలు కేదారి లక్ష్మి, టీడీపీ నాయకులు సీఎం రమణ వెంకట్, కిరణ్, మంజుల, అధిక సంఖ్యలో పేద మహిళలు పాల్గొన్నారు.

గజిబిజిగా కూడళ్లు

- జ్ఞానాపురం, కాన్వెంట్ జంక్షన్లలో కానరాని ట్రాఫిక్ పోలీసులు
- గందరగోళంగా వాహనాల రాకపోకలు
- ఇబ్బందులు పడుతున్న వాహన చోదకులు
- దృష్టి సారించని అధికారులు



కాన్వెంట్ జంక్షన్‌లో నిలిపిన వాహనాలు



జ్ఞానాపురం కూడలి మీదుగా ప్రయాణిస్తున్న వాహనాలు



జ్ఞానాపురం నుంచి కంచరపాలేనికి వెళ్లే బీఆర్‌టీఎస్ సబ్‌వేలో ఆటోలు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధిలోని కూడళ్లు గజిబిజిగా తయారయ్యాయి. జనసాంద్రత, వాహనాల రాకపోకలు అధికంగా ఉండే ఇక్కడి జంక్షన్లలో ట్రాఫిక్ పోలీసులు, సిగ్నళ్ల జాడ కనిపించడం లేదు. దీంతో కూడలి వద్ద రాకపోకలు సాగిస్తున్న వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వాహనదారుల నుంచి జరిమానాలు వసూలు చేస్తున్నప్పటికీ వారి భద్రతకు కనీస చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

విపరీతంగా ట్రాఫిక్ రద్దీ

కాన్వెంట్ కూడలిలోని న్యూ హోల్‌సేల్ మార్కెట్ వ్యాపారులు అక్కడి బీఆర్‌టీఎస్ రహదారులపైనే వ్యాపారాలు చేస్తున్నారు. బీఆర్‌టీఎస్ రోడ్డు సబ్‌వే మార్గాన్ని పూర్తిగా మూసేసి వ్యాపారాలు సాగిస్తున్నా.. ట్రాఫిక్ పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు వాహన చోదకులు చెబుతున్నారు. కంచరపాలెం నేతాజీ ఫ్లై ఓవర్ వంతెన కూడలి, భారతీయ ఆహార గిడ్డంగి సంస్థ వై-జంక్షన్, జ్ఞానాపురం రైల్వేస్టేషన్ కూడలి, చావులమదుం, కాన్వెంట్ కూడలి నుంచి గాజువాకకు వెళ్లే రహదారి, పోర్టుకు, నగరంలోకి వెళ్లే ప్రధాన రహదారి ప్రాంతాల్లో మూడు-నాలుగు వైపుల నుంచి వాహనాలు దూసుకొస్తుండటంతో రోజురోజుకూ ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరిగిపోతోంది. సాయంత్ర వేళలో ట్రాఫిక్ కట్టడికి పోలీసులు నానా అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఎన్నో ప్రమాదాలు..

జ్ఞానాపురం, కాన్వెంట్ జంక్షన్లలో ట్రాఫిక్ సిగ్నల్ లైట్లను వినియోగంలోకి తీసుకురావకపోవడంతో ఈ ఏడాదిలో సుమారు 45 వరకు చిన్న-పెద్ద రోడ్డు ప్రమాదాలు సంభవించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నళ్లు ఏర్పాటు చేసి అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు. సంబంధిత ట్రాఫిక్ అధికారులు దృష్టి సారించి ప్రధాన కూడళ్లలో వాహనాల రాకపోకలు సాఫీగా సాగేలా చర్యలు చేపట్టాలని వాహన చోదకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ట్రాఫిక్ సిబ్బంది జాడేది..?

ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాల నివారణ కోసం కాన్వెంట్ కూడలి నుంచి జ్ఞానాపురం, చావులమదుం, కంచరపాలెం ఫ్లైఓవర్ వంతెనకు వెళ్లే బీఆర్‌టీఎస్ రహదారిలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల కూడళ్లలో స్పీడ్ బ్రేకర్లు, ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. జ్ఞానాపురం రైల్వే స్టేషన్‌కు వెళ్లే కూడలి, ఎర్నిమాంబ ఆలయ రహదారి ప్రాంతాలు మరీ రద్దీగా ఉండటంతోపాటు ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటి నియంత్రణకు అటు కంచరపాలెం.. ఇటు హార్బర్ ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది కానరావడం లేదు. కాన్వెంట్ జంక్షన్‌లో ద్విచక్ర వాహన చోదకులపై కేసులు నమోదు చేయడానికి మాత్రం ట్రాఫిక్ పోలీసులు ఉదయం, సాయంత్రం వేళల్లో కనిపిస్తున్నారని పలువురు వాహనదారులు ఆరోపిస్తున్నారు.



కాన్వెంట్ కూడలిలో బీఆర్‌టీఎస్ రోడ్డుపై వ్యాపారాలు చేస్తున్న హోల్‌సేల్ మార్కెట్ వ్యాపారులు

బీఆర్‌టీఎస్ రహదారిలో ప్రమాదాలు

జ్ఞానాపురం-కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారుల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మార్గంలో ట్రాఫిక్ సిగ్నళ్లు, జీబ్రా క్రాసింగ్ లైన్లు ఏర్పాటు చేయాలి. ట్రాఫిక్ పోలీసులు ఈ దిశగా చర్యలు చేపట్టాలి. అప్పుడే రోడ్డు ప్రమాదాలను నియంత్రించగలం.

– ఎస్.దాసు, జ్ఞానాపురం

ట్రాఫిక్ సిబ్బందిని పెంచాలి

జ్ఞానాపురం, కాన్వెంట్ జంక్షన్లలో వాహనాల రాకపోకలు గందరగోళంగా సాగుతున్నాయి. ఇక్కడ ట్రాఫిక్ పోలీసులు అంతంత మాత్రంగానే కనిపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ పర్యవేక్షణకు సిబ్బందిని మరింత పెంచాలి.

– ఎల్.కుమార్, వాహనదారుడు

ఆఖరి గురువారం పూజలకు ఏర్పాట్లు



విశేష పూజలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి సన్నిధిలో మార్గశిర మాసం ఆఖరి గురువారం పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వీటిని ఈవో శోభారాణి, పోలీస్ అధికారులు పర్యవేక్షించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. భక్తుల సౌకర్యార్థం సింహాచలం, గోపాలపట్నం, కంచరపాలెం మీదుగా జ్ఞానాపురం, కనకమహాలక్ష్మి ఆలయానికి ఒక బస్సు, ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్, పెందుర్తి నుంచి మరో సర్వీసును ఉచితంగా నడపనున్నట్టు ఈవో తెలిపారు. గురువారం మధ్యాహ్నం 12 గంటల నుంచి టౌన్ కొత్తరోడ్డులోని జగన్నాథస్వామి ఆలయం వద్ద 20 వేల మంది భక్తులకు మహాన్నదానం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సహస్ర ఘటాభిషేకం నిర్వహించనున్న దృష్ట్యా గురువారం మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 7 గంటల వరకు అమ్మవారి దర్శనాలు ఉండవన్నారు. సాయంత్రం 6 గంటలకు నిర్వహించే పంచామృతాభిషేక సేవ కూడా రద్దు చేసినట్టు చెప్పారు. రాత్రి 7 తర్వాత అమ్మవారి దర్శనం కల్పిస్తామన్నారు. అమ్మవారి దర్శనానికి జిల్లా నలుమూలల నుంచే గాక వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే దృష్ట్యా ట్రాఫిక్‌ను మళ్లించనున్నట్టు ట్రాఫిక్ ఏడీసీపీ ఒక ప్రకటనలో తెలిపారు.

సిరులతల్లికి విశేష పూజలు : మార్గశిర మాసోత్సవాల 24వ రోజు బుధవారం కనకమహాలక్ష్మిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని విశేష పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నగరంలోని నృత్య కళాంజలికి చెందిన పి.రమ్యచే క్లాసికల్ డ్యాన్స్, పి.అరుణ బృందంచే నిర్వహించిన కోలాటం భక్తులను ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం 2,500 మంది భక్తులకు అన్నదానం జరిపారు ఆలయ ఈవో కె.శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, వేద పండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రిస్మస్ పండగ.. ఊరంతా వేడుక

- క్రైస్తవుల ప్రార్థనలతో కిటకిటలాడిన చర్చిలు
- జ్ఞానాపురం రక్షణగిరిలో ఘనంగా సంబరాలు



అమెరికన్ హాస్పిటల్ వద్ద వృద్ధురాలికి చీర అందిస్తున్న పీతల వాసు, గొరిపోటి శివ



శాంతాక్లాజ్ వేషధారణలో అలరిస్తున్న చిన్నారి



కల్వరి బాప్టిస్ట్ చర్చిలో క్రిస్మస్ సందేశమిస్తున్న రెవరెండ్ జాన్‌పీటర్



సెయింట్ పీటర్స్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



కల్వరి చర్చిలో క్రీస్తు పాటలు పాడుతున్న యువతులు

డాబాగార్డెన్స్: క్రైస్తవుల పర్వదినం క్రిస్మస్ పండగ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. నియోజకవర్గమంతా క్రిస్మస్ శోభను సంతరించుకుంది. క్రైస్తవులందరూ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు హ్యాపీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఏసు మార్గంలో నడవాలని బిషప్‌లు, ఫాదర్లు, పాస్టర్లు, దైవ సందేశం వినిపించారు. నగరంలోని సెయింట్ ఆంథోనీ చర్చి, ట్రినిటీ లూథరన్ చర్చి, బాప్టిస్ట్ చర్చిల్లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు వేలాది మంది క్రైస్తవులు తరలివచ్చారు. జిల్లా పరిషత్, జగదాంబ జంక్షన్, కురుపాం మార్కెట్, రీడింగ్ రూమ్, సౌత్ జైల్‌రోడ్డు, పాత పోస్టాఫీస్ తదితర ప్రాంతాల్లోని చర్చిల్లో వేడుకలు ఘనంగా జరిగాయి. చాలా చర్చిల్లో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. జిల్లా పరిషత్ తదితర ప్రాంతాల్లోని చిన్నారులు శాంతాక్లాజ్ వేషధారణలో అలరించారు.

అమెరికన్ వృద్ధాశ్రమంలో వేడుకలు

జీవీఎంసీ 29వ వార్డులోని అమెరికన్ హాస్పిటల్ ఓల్డేజ్ హోమ్‌లో గొరిపోటి లక్ష్మి, ఆమె కుమారుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొరిపోటి శివ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో వార్డు నాయకుడు పీతల వాసు పాల్గొన్నారు. గొరిపోటి లక్ష్మీనాయుడు కుమార్తె మేరీ కుమారి జ్ఞాపకార్థం వృద్ధులకు స్వీట్లు, దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ముందుగా కేక్ కట్‌చేసి వృద్ధులకు తినిపించారు. ఈ సందర్భంగా పీతల వాసు మాట్లాడుతూ లక్ష్మి కుటుంబానికి యేసు దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. పార్టీ నాయకులు గొరిపోటి శివ, బొండాడ వెంకటరావు, పీతల రాజు, కొండ్రు సతీష్, లిల్ల రాజు, గొలగాని మధు, మహేష్, శివ, గండివలస పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెం: జ్ఞానాపురం రక్షణగిరి పునీత పేతురు చర్చిలో రెవరెండ్ ఫాదర్ జె.ప్రకాష్, పారిస్ పాస్టిల్ కౌన్సిల్(పీపీసీ ఆధ్వర్యంలో క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్‌ప్రకాష్ క్రీస్తు జననం, బైబిల్ వాక్య సందేశమిచ్చారు. గెడ్డ వీధి, స్లీప్‌గుర్తు వీధి, కొండవీధి, సెబాస్టియన్ కాలనీ, బాబు కాలనీ ప్రాంతాల్లో క్రైస్తవులు ఏర్పాటు చేసిన ఏసు జననం పశువుల పాక సెట్‌లు చూపరులను ఆకట్టుకున్నాయి. సర్వమత సమ్మేళనంతో కూడిన సంబరాల్లో అనేక మంది పశువుల పాకను సందర్శించారు. ఇళ్లలోనూ పశువుల శాలను నిర్మించి, స్టార్ లైటింగ్‌లు ఏర్పాటు చేశారు. పునీత పేతురు చర్చి ప్రాంగణంలో సాంస్కృతిక, ఆటల పోటీలు నిర్వహించారు. ప్రధాన వీధుల్లో గ్రీటింగ్‌లు, కేకులు, గీతాలాపనతో క్రైస్తవులు కుటుంబ సమేతంగా సందగి పంగడ చేసుకున్నారు. సాయంత్రం రక్షణగిరిలో జరిగిన జాతరకు నగరం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. జ్ఞానాపురం ప్రాంతంలోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



అలంకరణలో మేరీమాత

క్రిస్మస్ సందడి

అల్లిపురం: అల్లిపురం కల్వరి బాప్టిస్ట్ చర్చిలో అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ ఎం.నారాయణరావు, పీవీ ప్రసాదరావు, రెవరెండ్ డాక్టర్ జి.మేత్యూపీటర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరాధన జరిగింది. రెవరెండ్ జి.జాన్‌పీటర్, కె.వేదమణి, ఎం.జోసఫ్‌రాజ్‌లు క్రిస్మస్ సందేశాన్ని అందించారు. మూడో ఆరాధనలో డాక్టర్ జి.మేత్యూపీటర్ క్రిస్మస్ సందేశమిచ్చారు. క్రీస్తును స్తుతిస్తూ క్రైస్తవులు, యువత పాటలు పాడి, ప్రార్థనలు చేశారు.

➡ కొబ్బరితోట వేలంగిణి మాత దేవాలయం వద్ద స్వాగత రెల్లి కుల యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు నడుపూరి మాధవ్, గండి రాజేష్, డి.గోపి, నడుపూరి లక్ష్మణ్ కేక్ కట్‌చేసి ప్రార్థనలు నిర్వహించారు. క్రిస్మస్ సందర్భంగా ఏర్పాటు చేసిన యేసు జననం పసువుల పాక సెట్ స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. క్రిస్మస్ వేడుకల్లో యువత, చిన్నారులు సందడి చేశారు.



కొబ్బరితోటలో క్రిస్మస్ వేడుకలు



ఆకట్టుకుంటున్న ఏసు జననం సెట్

వసతి గృహంలో ముగ్గురికి ఆశ్రయం



ఏయూటీడీ వసతి గృహంలో నిరాశ్రయులు తుంపాల గణేష్, రామాంజనేయులు



వసతి గృహానికి యువతిని అప్పగిస్తున్న పోలీసులు

సీతమ్మధార: ఉపాధి నిమిత్తం సొంతూరి నుంచి విశాఖ వచ్చిన ఇద్దరు వ్యక్తులను జీవీఎంసీ వసతి గృహానికి తరలించారు. ఏయూటీడీ సంస్థ ప్రతినిధులు తెలిపిన వివరాలిలా.. విజయనగరం జిల్లా దేవరాపల్లికి చెందిన తుంపాల గణేష్(ఫొటోలోని మొదటి వ్యక్తి)కు కుటుంబ సభ్యులు ఎవరూ లేరు. లేబర్ పనిచేస్తుంటాడు. పని కోసం వచ్చి విశాఖ రైల్వే స్టేషన్ దరి ఫుట్‌పాత్ మీద ఉంటున్నాడు. గుంటూరు శివాలయపురానికి చెందిన జి.రామాంజనేయులు(రెండో వ్యక్తి) భార్యతో విడాకులు తీసుకుని 18 ఏళ్లయింది. గుంటూరులోని ఓ హోటల్‌లో పనిచేసేవాడు. ఉపాధి నిమిత్తం వచ్చి విశాఖ రైల్వే స్టేషన్ వద్ద ఉండగా.. వీరిద్దరినీ ఏయూటీడీ సిబ్బంది నైట్ విజిటింగ్‌లో చూసి ద్వారకానగర్ జీవీఎంసీ-ఏయూటీడీ వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. నెల రోజుల్లో ఉపాధి చూసుకుని వెళ్లిపోవాలని వారికి చెప్పినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు, వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయి తెలిపారు.

గుర్తు తెలియని యువతికి ఆశ్రయం

రోడ్డు మీద తిరుగుతున్న ఒక యువతికి జీవీఎంసీ వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. ఏయూటీడీ సంస్థ ప్రతినిధి తెలిపిన వివరాలిలా.. పెదగంట్యాడ న్యూపోర్ట్ పోలీస్ స్టేషన్ సిబ్బంది గుర్తు తెలియని ఒక యువతిని బుధవారం ద్వారకానగర్ టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని జీవీఎంసీ-ఏయూటీడీ మహిళా షెల్టర్ హోమ్‌కు తీసుకొచ్చారు. ఈమె గాజువాక సమతా నగర్ కాలనీలో ఒంటరిగా తిరుగుతుంటే స్థానికులు 112కు కాల్ చేసి సమాచారమిచ్చారు. న్యూ పోర్ట్ సీఐ కామేశ్వరరావు ఆదేశాలతో హెడ్ కానిస్టేబుల్ కన్నారావు ఆ యువతిని షెల్టర్‌కు తీసుకొచ్చి నిర్వాహకులకు అప్పగించారు. ఆమె తన పేరు, ఊరూ ఏమీ చెప్పడం లేదు. మానసిక రోగి కావడంతో వసతి గృహంలో ఆశ్రయమిచ్చారు. వెంటనే శ్రద్ధా ఫౌండేషన్ ద్వారా ఈ యువతికి చికిత్స ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయండి



ర్యాలీ ప్రారంభిస్తున్న వెంకటరెడ్డి

డాబాగార్డెన్స్: ఈ నెల 28, 29 తేదీల్లో పెందుర్తిలో నిర్వహించనున్న సీపీఎం విశాఖ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ నాయకుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం చేపట్టిన బైక్ ర్యాలీని సీపీఎం నాయకుడు పి.వెంకటరెడ్డి ప్రారంభించారు. సీపీఎం జగదాంబ జోన్ ఆధ్వర్యంలో ఎం.సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన ర్యాలీ జగదాంబ జంక్షన్, పోలీస్ బ్యారెక్స్, పూర్ణా మార్కెట్, టౌన్ కొత్తరోడ్డు మీదుగా దుర్గాలమ్మ గుడి జంక్షన్, డాబాగార్డెన్స్, ఆర్టీసీ కాంప్లెక్స్, జీవీఎంసీ మీదుగా తిరిగి జగదాంబ జంక్షన్‌కు చేరుకుంది. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు వై.రాజు, మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.చంద్రశేఖర్, భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం నాయకుడు కె.నర్సింగరావు, మెడికల్ యూనియన్ నాయకుడు చంద్రమౌళి, స్రవంత్, డీవైఎఫ్ఐ నాయకుడు సంతోష్‌కుమార్, నాయుడు, తోపుడు బండ్ల యూనియన్ నాయకుడు శ్రీనివాస్, వర్కింగ్ ఉమెన్స్ నాయకులు పి.మణి, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

డాబాగార్డెన్స్: పాతనగరం ముసలికంటివారి వీధికి చెందిన ఓ వ్యక్తి సైనేడ్ మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ముసలికంటి వారి వీధికి చెందిన రామోజు చినబాబు సమస్యల కారణంగా సైనేడ్ మింగి ఆత్మహత్య చేసుకున్నట్టు సమాచారం వచ్చిందని, సంఘటన ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి పంపినట్టు పోలీసులు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ జి.దేముడుబాబు తెలిపారు.

ఏడాది కిందట భార్య అనుమానాస్పద మృతి

చినబాబు భార్య సత్యవతి ఏడాది కిందట అనుమానాస్పదంగా మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు అప్పట్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పుడు చినబాబు మృతి చెందడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సత్యవతి మృతి కేసు దర్యాప్తును పోలీసులు వేగవంతం చేశారని, ఆమె భర్త చినబాబుపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేస్తున్న నేపథ్యంలో తనపై ఏమైనా కేసు వస్తుందనే భయంతో అతడు సూసైడ్ చేసుకున్నట్టు పలువురు అంటున్నారు.